కొండమీది కోనేరు

కంచనపల్లి వెంకటకిషన్‌రావు



అనగా వో కొండ... ఆ కొండమీద వో కోనేరు...కోనేరు ప్రక్కనే వో శివాలయం వెలిసింది, అంతకుముందు ఎండుముఖంతో వెలవెల పోయే కోనేరు—శివాలయం వెలయడం, కోనేటికి నీటివాలు వేపుగా వో అడ్డకట్ట కట్టడంతో—యిప్పుడు సంవత్సరమంతా కళకళలాడుతున్నది.

* * * *

పరాంకుశం తనగదిలో పచార్లు చేస్తున్నాడు—కుడిచేతి పిడికిలి బిగించి—ఎడమచేతి, అరచేతికి గట్టిగా కొడుతూ.

భ్రుకుటి బ్రాకెట్లా తయారయింది, నొసలు ముడవడంతో వొళ్ళంతా సూదులతో గుచ్చినట్టుగా బాధ...మనసంతా సాలెగూటిలో చిక్కుకున్న పురుగులా ఒకటే రొద...

ఏనుగును అంకుశంతో పొడిస్తే కలిగే బాధ... అకస్మాత్తుగా పచారు ఆపాడు...వో నిముషం తరువాత మళ్లీ నడిచాడు...

గది బయటవున్న జవాను కాస్తా మాడుతున్న మూకుట్లో పడబోయే జొన్న గింజలా భయపడుతున్నాడు— పరాంకుశంగారి కోపానికి పేలి—పేలపు గింజయ్యే ప్రమాదముందని.

ఆలోచనలు వేసవి యెండల్లా మాడుస్తున్నాయి, పరాంకుశాన్ని ...వెధవ—వో వంద రూపాయిల జీతగాడు తనను నలుగుర్లో యింత మాటంటాడా ... వెంకన్నెంత...వెంకన్న తాహతెంత ... వాడి తాత తాహతెంత...పోనీ తనుకోపంలో ఏదో వో చిన్న మాటన్నాడే అనుకో ...'కుక్కలతో పని చేయించు కొనేవాళ్ళు పెద్ద కుక్క లవుతారని తెలుసుకోండి—'అంటాడా ...

వంద లౌడ్‌స్పీకర్లు ఫుల్‌వాల్యూమ్‌లో రెండు చెవుల దగ్గర పెట్టి అవే మాటల్ని వినిపిస్తున్నట్టుగా...ఫ్యాక్టరీ అంతా అవే మాటలు వినాదాల్లా భావించి తన ముఖాన్నే అంటున్నట్టుగా అనిపించింది...

తను వయసులో అంత ముదరక పోయినప్పటికీ ఫ్యాక్టరీకి తండ్రిలాంటి వాడు...తండ్రి వోమాటంటే పడకుండా తండ్రినే ఎదిరించి ఎంత మాటంటే అంతమాట అనేస్తే ...... అందుకే దేశం

యిలా తగలడింది ... శిక్షణ లోపించి యజమానుల మాటలు వినని పనివాళ్లున్నంత కాలం దేశం బాగుపడదు — ఎన్ని ప్రణాళికలు వేస్తేనేం కనుక...

ఇంతకి వాణ్నేం చేయాలి...తగినశిక్ష... వెంటనే తను వెంకన్నకు వుద్యోగం యిచ్చే నాటి దృశ్యం గుర్తుకొచ్చింది. ఎంత దీనంగా ప్రార్థించాడు తనని...ఎంతగా విలపించాడు... కొంచెం బింకంగా వుంటే కాళ్లట్టుకోమన్నా అట్టుకొనే వాడు... అందితేకాళ్లు అందకపోతే జుట్టు ఈథర్డ్ క్లాస్ తత్వమే అంత...అందుకే బ్రిటిష్ వాళ్లు వీపులు బద్దలుకొట్టి పనులు చేయించుకొనేవాళ్లు—వున్న వుద్యోగంనుంచి వూడబీకేస్తే వూపిరాడకుండా చస్తాడు వెధవ...ఎన్ని నక్కవినయాలు చూపాడా రోజు...తప్పకుండా ఆ పనే చేయాలి...

స్టెనోనుపిలిచి ఆర్డర్ డ్రాఫ్ట్చెద్దామను కున్నాడు. ఇంతలో బయటిజవాను సీమ కుక్కనిచూసి భయపడుతున్న పిల్లిలాగా మెల్లిగా అడుగులు వేసుకుంటూ వో ఉత్తరాన్ని పరాంకుశం టేబుల్మీద పెట్టాడు. ఉత్తరం కాస్తా ఫ్యానుగాలికి ఎగిరిపోయింది.

'ఫూల్...ఈ ఫ్యానిలా తిరుగుతుంటే దీనిమీద పేపర్వెయిట్ పెట్టక్కర్లా... మళ్లీ ఏంవన్నా అని జీతం కోస్తానంటే 'పిల్లాజెల్లాగలవాణ్ని' అంటూ పిల్లికూతలు కూస్తావ్' అన్నాడు పరాంకుశం.

వాక్యం మొదలుపెట్టగానే లోపలికి పరిగెత్తుకువచ్చి క్రిందపడ్డ వుత్తరం యిచ్చిన జవాను వణకడం అతని తలపాగాచూస్తేనే తెలిసింది.

'గెటౌట్...టక్కులుచూపించే వక్కవినయాలుమటుకు పుష్కలంగా నేర్చుకుంటారు...'

జవాను సలాంకొట్టి బయటపడ్డాడు.

చల్లబడడానికి ఫ్రిజిడేర్ లోంచి వో కూల్డ్రింక్ తీసుకుని తాగేసి ఖాళీ సీసాను చప్పుడయ్యేట్టు టేబుల్ మీద పెట్టి వచ్చిన కవరును ఎడంచేత్తో అందుకుని కుడిచేత్తో చించాడు.

ఖాళీసీసా చప్పుడువిన్న జవాను పరిగెత్తి వచ్చి కూల్డ్రింక్ సీసాను తీసుకెళ్లి వాష్ బేసిన్లో శుభ్రంచేసి ఫ్రిజిడేర్లోపెట్టి నిలుచున్నాడు.

'వెళ్లు' అని ఒక్కసారి కసురుకోవడంతో జవాను బయటపడ్డాడు.

పరాంకుశం ఆ పొడుగాటి కవర్లోంచి వో పొడుగు వుత్తరంతీసి చదవసాగాడు.

'పరం...

చాలా రోజుల్నించి నీకు వుత్తరం రాద్దామనుకుంటున్నా యిన్నాళ్టికి తీరిక దొరికింది. నా అణాకాని వుద్యోగంతో ఏదో నేను క్షేమం.

నీ వుద్యోగం నీకు బాగా నచ్చినట్టూ, నిన్నుచూస్తే ఫ్యాక్టరీఅంతా గజగజ వణుకుతున్నట్టూ రాసావు. అది నీకు సంతోషమే అయినా నాకు చాలా విచారకరం...

ఎందుకంటావేమో ... ఈ ఉత్తరం నీకో ముఖ్యవిషయం రాయడానికే మొదలు పెట్టాను—నీగుణం నాకు తెలుసుకనుక...

మొదట్నుంచీ నువ్వు గారాబంగా పెరిగావు. తండ్రిలేని నిన్ను ప్రాణానికి ప్రాణంగా పెంచింది మేము. అల్లారు ముద్దుగా పెరిగి, పెద్దయి, చదువుకుంటున్న నీకు, ఖర్మవశాత్తూ వ్యాపారంలో వచ్చిన నష్టాన్ని తెలియపరచకుండా నీవడిగినంత డబ్బు పంపి నీ చదువెలాగో పూర్తయిందనిపించాం...నీవు వో కాగితం పట్టుకొని వచ్చేటప్పటికే యిల్లూ వాకిలీ మార్వాడీకి మదుపెళ్లాయి. తెలిసిన సత్యాన్ని నీకు చెప్పలేకా, చెప్పి వొప్పించలేకా మీ అమ్మ కన్ను మూసింది. అప్పుడు నేను ఆదుకుని — నీకు వో యిల్లరికం కుదిర్చి—నీవు చేసే వుద్యోగం యిప్పించక పోతే యీనాడు నిరుద్యోగంతో సతమతమై సర్వకష్టాలూ అనుభవిస్తున్న వేలాది విద్యావంతుల్లో నువ్వు ఒకడివయి కుళాయినీళ్లతో కాలం వెళ్లబుచ్చే వాడివి, అంతేకాదూ!

కానీ పరం...అదృష్టం నిన్ను వరించింది. అందుకే యీనాడు నీకు కలిగిన అదృష్టాన్ని చూసుకొని గర్వపడుతున్నావు ... ఇదంతా ఎందుకంటావా — నా అన్నయ్య కొడుకువైనా, నా కొడుకువైనా నువ్వే అనుకుని ప్రేమించబట్టి యిదంతా వ్రాస్తున్నాను.

వో మాట విన్నా వరం...

...ఆరోజులు—నేనూ, అన్నయ్యా కష్టపడి వో కొండ్రభూమి సాగు చేస్తున్న రోజులు!— అప్పటి కరణం — కామయ్య పంతులు—మన వూరికి మకుటంలేని మహారాజుగారు...చేసిన సేద్యమంతా— పట్టాలు లేవన్నీ, ఆ పన్ననీ, యీ పన్ననీ పెరటిపంటతా మూటకట్టించుకొని వెళ్లేవాడు ... ఎదురు మాట్లాడితే 'వెధవ ముండాకొడకా'...అని బూతు పంచాంగం మొదలెట్టేవాడు ... హంటర్తో వీపుమీద హనుమంతుని బొమ్మలు గీసేవాడు...సేకుసిందీలతో వలుగుర్లో, నడివీధిలోకి గుంజించి నానా నగుబాట్లూ చేసేవాడు...ఆయన్నని మటుకు తప్పేముంది ... అధికారం అటువంటిది ... పైన అధికారులటువంటివారు...

...ఇదంతా అన్నయ్యకు నచ్చక పోయేది! నామట్టుకు నేను ఏ ఎండకా గొడుగు పట్టే వాణ్ని గనక యిప్పటిదాకా బ్రతక కలిగాను. అన్నయ్య అడపాదడపా ఎదురు తిరిగి అన్యాయపు పనుల్ని— పన్నుల్ని— చెల్లనిచ్చేవాడు కాదు...ఇలా వుండగా వోసారి శిస్తు వసూళ్లప్పుడు కరణంగారు అన్నయ్యకు భయపడి —పై అధికారిని పిలిపించుకున్నాడు. ఆతనితోపాటూ జవానులూ సిద్ధం...అంతకు మునుపే సాంబ్రాణి పొగ వూదినందువల్ల— అన్నయ్య ఆవేశంలో అన్న పచ్చి నిజాలన్నీ —అధికారికి తల తిరుగుడు సమాధానాలుగా తోచాయి.'

ఆరోజుల్లో అధికారి కంటబడ్డిన ఆడవాళ్లను ఊరికే వదిలేవాళ్లు కాదు—ఆవిడ ఎంత శీలవతైనాసరే, అధికారి దురాగతానికి బలికావలసిందే ... అసలే కోపంగా వున్న కరణం కామయ్యగారు అధికారిని—వో బిడ్డ తల్లయిన—వదిన మీదికి ఉసిగొల్పాడు ... అంతే...

ఆ రాత్రికి వదిన్ని 'మకాం'లోకి పంపమని అధికారి ఆర్డర్ వేసాడు...అది రాజశాసనం...

వెనకటి కీచక వధ బాగా జ్ఞాపకం వున్న అన్నయ్య—ఎంత చెప్పినా వినలేదు, మరేదైనా వుపాయం చూడమన్నా తనమూర్ఖత్వం విడవలెదు. ఆ రోజు నిజంగానే భీముడై, కీచకుణ్ని, చంపాడు. అన్నయ్య మటుకు ఆ జవాన్ల దురాగతానికీ, అధికారి అహంకారానికీ కామయ్య కుట్రకూ ఆహుతైపోయాడు. ఆ తరువాత పరిస్థితి గ్రహించి వదినా, నీవూ, నేనూ పొలిమేర దాటి వెళ్లాం. పొలిమేర దాటి వెళ్లడానికి కూడా యెన్ని వెండినాణ్లేలు యివ్వవలసి వచ్చిందను కున్నావ్!

ఆ తరువాత రాజకీయాలు మారి, మా

ప్రాణం కాస్త కుదుటబడి తిరిగి ఏవో ఒడ్డుకే చేరుకుని [చేయి తిప్పుకున్నాం. మళ్లీ కొన్నాళ్లు వెన్నెల కాసింది...తిరిగి కుంభ వృష్టి కురిసి వెలిసినట్టు వ్యాపారంలో దెబ్బ తిన్నాం.

కొండ మీది కోనేరు

...అలాంటి రోజా లన్నింటినీ నీకు జ్ఞాపకం చేయడంలో నా వుద్దేశ్యం ఒకటే ...నీ గుణం మార్చాలని...

నీవు నీ అధికారంలో క్రిందివారిని గడ గడలాడించుకొని 'పిల్లికి చెలగాటం, ఎలుక్కి ప్రాణసంకట'పు పరిస్థితిని సృష్టిస్తే, ఆ నరరూప రాక్షసులక్కూ నీకూ— తేడా యేమిటి బాబూ.

అది నీ తప్పు కాదు—నీవు స్వచ్ఛంగా మంచివాడివే. నీ మీద కుబుసంలా పరచు కొన్న, పదవీ గర్వం నీ శరీరాన్ని పిటపిట లాడిస్తున్నది...పాము కుబుసం విడిచిందాకా వో చోట పడుకోలేదు బాబూ. దాని వేడి అణగాలంటే కుబుసం విడాల్సిందే...నీ గర్వం నిన్ను అవమానిస్తుంది బాబూ. అదిమటుకు నిజం...నీ స్థితిగతులూ, సంఘంలో నీపేరు ప్రతిష్ఠలూ...నీ ధనమూ ఏవీ ఆ రోజు అడ్డు రావు బాబూ! ఒకవేళ వచ్చినా అరుణ కిరణాలు వెదజల్లే ఆ నిండు దినకరుని కాంతిముందు, ఆ ప్రచండభానుని ప్రతాప రేఖలముందు నీ వొక కాలిపోయిన కొవ్వొత్తిలా తల వొంచుకోవాలి బాబూ. ఇంత పరిస్థితి రాకుండా ముందే నీకు తెలియ చెబుతున్నాను. నీ వొక యుక్తవయస్కుడివి తెలివికలవాడివీ అయ్యావు. నా మాటలను సరిగా అర్థం చేసుకుంటావు కదూ. అమ్మాయిని అడిగినట్టు చెప్పు...ఉంటాను.

నీ బాబాయి.'

ఉత్తరం చదివిన పరాంకుశం ముఖంలో ఏదో మార్పు గోచరించింది...స్టెనోనూ, వెంకన్ననూ పిలిపించాడు. వెంకన్నకు క్షమా పణ చెప్పుకొని, స్టెనోకు వో ఆర్డర్ డ్రాఫ్టిచ్చాడు. అది శిక్ష కాదు...పై మెట్టుక్కి వెంకన్నని ఎక్కించడం...

* * *

కొండమీది కోనేరు కళ కళలాడే నీటితో మురిసి, దూరంగా, నగరంలో ప్రవహిస్తున్న మురికి కాలువకేసి అసహ్యంగా చూసేది... ఉన్నట్టుండి వోసారి పురుములూ మెరుపులతో కుంభవృష్టి కురిసింది...మెరిసింది... శివాలయం మీద పిడుగు పడి, గుడంతా కోనేట్లో కూలింది. నీరు ఉబికి అడ్డుకట్ట తెగింది. పోయిన నీళ్లు పోగా — మూలన వున్న వో ముంతెడు నీళ్లు చూసుకుని కోనేరు—'నా కివే చాలు' అనుకుంది...నగరం లోని కాలువల గురించి మరేనాడూ ఆలోచించలేదు ఆ కొండమీది కోనేరు. ●

సుగుణా ఎంటర్ప్రెయిజెస్ (రిజిష్టర్డు)

కాళికా లేన్ మేజిస్ట్రేటు కోర్టు ఎదుట **కాకినాడ. (ఏ.పి.)**

[సుప్రీంకోర్టు తీర్పుననుసరించి కట్టుదిట్టమైనపద్ధతులలో పెద్దఎత్తునవిర్వహించబడుతున్నసంస్థ]

సాహిత్య పోటి నెం. 1.

మా ప్రత్యేకత :— తక్కువ ఎంట్రీ ఫీజు, ఎక్కువ బహుమతులు

రు. 25,000 గెలుపొందండి

ఆల్ కరెక్టు: రు. 20,000	ఎంట్రీ రుసుము	పొడిగింపబడిన
1 తప్పు: రు. 3,000	1 ఎంట్రీ రు. 1	ముగింపు తేది 12-3-71
తప్పులు రు 1,500	4 ఎంట్రీలు రు. 3	కీపొల్యూషన్ 19—3—71
ఎక్కువ ఎంట్రీలు పంపిన	10 ఎంట్రీలు రు. 7	ఆంధ్రపత్రిక డైలీ,
4 గురికి వరుసగా రు 200,	100 ఎంట్రీలు రు. 60	ఆంధ్రజ్యోతి డైలీలో
రు 150, రు 100, రు 50		ప్రచురింపబడును.

ఆధారములు :—

1. ఆడది తన గతి తను చూచుకోలేనంతవరకూ మగవాడు ఏదారికి మలుపుతే ఆ దారిలోనే పయనించక / ప్రవహించక తప్పదు.
2. స్త్రీ దేశానికి నాయకత్వం వహించటం, పెద్ద పెద్ద పదవులు నిర్వహించటం ఆ సంగతి అలా ఉంచండి, ముందు జీవించే అర్హత/సమర్థత ఒకటి సంపాదించుకోవాలంటాను.
3. కళాపిపాసి హృదయమతి కోమలంగా / సుకుమారంగా ఉంటుంది. బాధను చూసి బాధపడిపోతుంది. ఉదార భావాలతో ఉప్పొంగి పోతూ ఉంటుంది.
4. మానవు డెప్పుడూ సంఘంనుండి వేరు కాలేడు. సంఘంలో భాగస్వామిగా ఉంటూనే సంఘోన్నతికోసం / మంచి మార్పుకోసం ప్రయత్నిస్తుండాలి.
5. గాయపడిన హృదయాలు, చెదిరిన మనసులు, అతి వికృతమైన / శోచనీయమయిన మానవ స్థితికి దిగజారిపోయే ప్రమాదం ఉంటుంది.
6. దైవత్వం ఏదో పాలులోలేకుండా మానవమాత్రుడు ఏ మహత్కార్యం/ఘనకార్యం చెయ్యలేడు.
7. ఏ మనిషినైనా అర్థం చేసుకోవాలంటే ఆ మనిషిని పరిశీలించాలి/అనుసరించాలి.
8. మనకు గిట్టనివాడు ఉపకారం / మంచిపనులు చేస్తున్నా మన హృదయంలో అతనిపట్ల ఉన్న వ్యతిరేకత ఒక్కసారిగా తొలగిపోదు.
9. ఆ మాటల్లో శిథిల సౌధం ముందు నిలబడిన శిల్పిబాధ/వ్యథ ధ్వనించింది.
10. నిశ్శబ్దంలో నుంచి వెలువడే ఆ ఆరాధనే/ఆవేదనే గుండెల చప్పుడుగా మారుచున్నది.
11. మనస్సు అపహరించి మమతలు అందివ్వని మానినులు/మగువలు మానవజీవితాన్నే మార్చేస్తారు.
12. మనిషి నడత వెనకాల దాగొన్న మనస్సులోని భావాలు, పరిశోధించటం, అర్థం చేసుకోవటం, వాటికి అనుగుణ్యంగా/ తగినట్లుగా నడచుకోవటం ఒక పెద్ద కళ.

నిబంధనలు

1. మొత్తము వాక్యము వ్రాయనవసరంలేదు. మీరు కోరుకొనే పదములు వరుసగా తెల్ల కాగితంపై వ్రాసి ఎన్ని ఎంట్రీల నయిననూ పంపవచ్చును. 2. ఎంట్రీ రుసుము M. O. ద్వారా పంపినచో రసీదు జతపర్చవలెను. క్రాస్ చేయని ఇండియన్ పోస్టల్ ఆర్డర్లు కూడా పంప వచ్చును. 3. రచయిత లేక రచయిత్రి వాడిన పదమే సరియయినది. 4. ఒకరికన్న ఎక్కువ గెలిచినచో బహుమతి సొమ్ము సమముగా పంచబడును. 5. మేనేజిమెంటువారిదే తుది నిర్ణయము. వివాదేవిలు కాకినాడ కోర్టులో పరిష్కరించుకొనవలెను. 6. ఆక్షేపణలు, ఫలితములు ప్రకటించబడిన 10 రోజులలోగా 10 రూ. పంపుతూ మాకు తెలియ పర్చవలెను. 7. విజేతల లిస్టు, తరువాత పోటీ ఎంట్రీల నిమిత్తం 30 పైసలు పోస్టలు స్టాంపులు జతపర్చవలెను. 8. ముగింపు తేదీన కూడా ఎక్స్ప్రెస్ డెలివరీలో ఎంట్రీలు పంపవచ్చును. 9. ఫీజు ఎంట్రీలు, మనియార్డరు ఒకేసారి పంపవలెను. 10. ఒకరు ఎన్ని బహుమతులయిననూ గెలవవచ్చును.